క్లుప్తంగా

స్కిల్ హబ్ సెంటర్‌లో మూడు నెలల శిక్షణ కోర్సు

చీరాల అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో స్కిల్ హబ్ సెంటర్‌లో అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, హెల్పర్ ఎలక్ట్రీషియన్ కోర్సుల శిక్షణకు నిరుద్యోగ యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ కొనసాగుతుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు, సంబంధిత విద్యార్హత గల అభ్యర్థులు ఈనెల 10వ తేదీ లోపు 79814 43777, 98665 37945 నంబర్లకు సంప్రదించి రిజిస్టర్ చేయించుకోవాలన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

యద్దనపూడి (పర్చూరు): రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ అయూబ్ హుస్సేన్, ఇన్‌చార్జి కరీంబాషా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17వ తేదీలోపు పర్చూరు ఉర్దూ అకాడమీ శిక్షణ కేంద్రంలో అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు, 40 ఏళ్లలోపు స్త్రీ, పురుషులు నమోదు చేసుకోవచ్చన్నారు. ముస్లిం, మైనార్టీ అభ్యర్థులకు ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. శిక్షణ అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ వారిచే ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వారు తెలిపారు. వివరాలకు 83414 71407, 65334 77797 నంబర్లను సంప్రదించాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి

మార్టూరు: పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసిన ఘటన మండలంలోని నాగరాజుపల్లి గ్రామంలో సోమవారం సాయంత్రం జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామ శివాలయం సమీపంలో ఓ రేకుల షెడ్డులో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారనే ముందస్తు సమాచారంతో పర్చూరు సెబ్ ఎస్సై శివరామప్రసాద్ తమ బృందంతో దాడి చేశారు. అందులో భాగంగా పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ 5,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సెబ్ ఎస్‌ఐ తెలిపారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ

అద్దంకి రూరల్: ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటిఎంచి పోషించాలని తహశీల్దార్ జీవీ సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బంగ్లా రోడ్‌లోని ప్రయివేటు పాఠశాల నిర్వహించిన హరితాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

అర్జీల విచారణలో అశ్రద్ధ తగదు

చీరాల టౌన్: రెవెన్యూ సేవలను సత్వరంగా అందించడంతో పాటుగా ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు సూచించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ, మండలస్థాయి అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేస్తూ అందుబాటులో ఉండాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా నీటి తీరువా వసూళ్లను త్వరగా చేయడంతో పాటు అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ చేయించాలన్నారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం వచ్చిన అర్జీలను విచారించి పత్రాలు మంజూరు చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. రెవెన్యూ సిబ్బంది విధుల్లో అశ్రద్ధ వహించినా, అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ సురేష్, ఆర్ఐ శేఖర్, వీఆర్వోలు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని



ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయణం, అధిక శ్రావణ మాసం, అశ్వని నక్షత్రం నవమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

బడి బస్సు.. రాయితీ పాసు

- విద్యార్థులూ.. అందుకోండి రాయితీ బస్‌పాసులు
- విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు
- సులభ ప్రయాణానికి రైట్ రైట్..

చీరాల అర్బన్:

ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు తీసుకువచ్చింది. ఎన్నో సంక్షేమ పథకాలతో పాటు వారి అభివృద్ధికి సైతం పాటుపడుతోంది. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యాయి. కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించి స్టూడెంట్ బస్సు పాసుల జారీ ప్రక్రియను ఆర్టీసీ అధికారులు ఇప్పటికే ప్రారంభించారు. ఉచిత, రాయితీ బస్‌పాసులను బస్టాండ్‌లోని బస్‌పాస్ కౌంటర్లలో అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో సర్వీసులు ఉండేలా ఏర్పాటు చేసి విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చేస్తున్నారు ఆర్టీసీ అధికారులు. దీంతో విద్యార్థులు పాఠశాలలకు, ఇళ్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్ణీత సమయంలో చేరుకుంటున్నారు.

గతేడాది స్టూడెంట్ పాసులు 4000..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుంది. ప్రతి విద్యార్థి చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వాటి రూపురేఖలను మార్చేశారు. విద్యార్థులకు తరగతి గదులు, వసతి సౌకర్యాలు అందించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉచిత, రాయితీ బస్‌పాసులను అందిస్తున్నారు. అలానే మరికొన్ని పాఠశాలలకు ప్రత్యేకంగా బస్ సర్వీసులను ఏర్పాటు చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థుల చదువుకు ఊతమిచ్చేలా ఏటా ఆర్టీసీ బస్సుపాసులను జారీ చేస్తోంది. ఇందు కోసం ఆన్‌లైన్ ద్వారా ఆర్టీసీ దరఖాస్తులను స్వీకరిస్తుంది. చీరాల ఆర్టీసీ డిపో పరిధిలో చీరాల, పర్చూరు నియోజకవర్గాలు ఉన్నాయి. చీరాల నుంచి పరిసర ప్రాంతాలకు విద్యార్థులు రోజూ పాఠశాలలు, కళాశాలలకు వెళ్తుంటారు. చీరాల డిపోలో గతేడాది స్టూడెంట్ పాసులు 4000, రాయితీ బస్ పాసులు 1600 అందించారు.



చీరాల బస్టాండ్‌లోని బస్ పాస్ కౌంటర్

ఆర్టీసీలో ఉచిత బస్‌పాసులు..

ఆర్టీసీలో ప్రతి ఏడాది ఉచిత పాసులు అందిస్తుంది. బాలురకు 12 ఏళ్లు నిండే వరకు, బాలికలకు 18 ఏళ్లు నిండే వరకు ఉచిత పాసులు అందిస్తున్నారు. ఈ పాసుల వలన విద్యార్థులు తన నివాస ప్రాంతం నుంచి 20 కిలో మీటర్ల వరకు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. చీరాల ప్రాంతంలో ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ కాలేజీలు ఎక్కువగా ఉన్నాయి. వీటితో పాటు బాపట్ల, చేబ్రోలు వంటి ప్రాంతాలకు కూడా వెళ్లి చదువుకుంటున్నారు. విద్యార్థి ఫొటో, స్కూల్ యాజమాన్యం నుంచి ధ్రువీకరణ పత్రం అందించాలి. పాస్ ఐడెంటిటీ కార్డు నిమిత్తం రూ.50 చెల్లించాలి. ఈపాసులలో నెలవారీ, మూడు నెలలకు ఒకసారి, సంవత్సరం పాసులు అందిస్తారు. ఇంటి నుంచి విద్యాసంస్థకు మధ్య ఉన్న దూరం, సమయాన్ని బట్టి స్టూడెంట్ పాసుల ధర నిర్ణయిస్తారు. మొదటిసారి ఏ కాలపరిమితితో పాసు తీసుకున్నారో తర్వాత రెన్యూవల్ పాస్ కూడా అదే కాలపరిమితికి జారీ చేస్తారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు కోసం ఏపీఎస్ఆర్టీసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి బస్సు పాసుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. నిర్ణీత నగదు కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించిన తర్వాత ప్రింట్ తీసుకుని బస్‌పాస్ కౌంటర్‌లో అందిస్తే ఆన్‌లైన్ కోడ్ నెంబర్ ద్వారా పాస్‌లను జారీ చేస్తారు. అలానే దివ్యాంగులకు కూడా రాయితీ బస్‌పాసులు అందిస్తున్నారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సులు..

విద్యార్థులకు రాయితీ, ఉచిత బస్‌పాసులు ఇవ్వడమే కాకుండా ఆర్టీసీ విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నారు. ఎక్కువ మంది విద్యార్థులుంటే పాఠశాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో రెండుసార్లు ప్రత్యేక సర్వీసును నడుపుతున్నారు. చీరాల డిపో నుంచి వాడరేవులోని ఏఎంజీ స్కూల్, ఈపూరుపాలెం బైపాస్ వద్ద గల ఏపీ మోడల్ స్కూల్‌కు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చీరాల ఆర్టీసీ బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సు నడుస్తుంది. అలానే బాపట్లలోని సూర్యలంక కేంద్రీయ విద్యాలయానికి చీరాల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు వెళ్తుంటారు. వీరి కోసం ఉదయం, సాయంత్రం బాపట్ల డిపో నుంచి చీరాలకు ప్రత్యేక సర్వీసును నడుపుతున్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సునీత

- ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల టౌన్: విద్యతోనే జీవితంలో ఉన్నత స్థానం.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలిచేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత అన్నారు. సోమవారం మండలంలోని ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఎమ్మెల్సీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హైస్కూల్లో చదువుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించడంతో పాటుగా చదువుకునే వారికి అమ్మఒడి, ప్రతిభ చూపిన విద్యార్థులు పారితోషికం అందిస్తూ విద్యను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అలానే ఉపాధ్యాయులకు పలు సూచనలు అందించి అంకితభావంతో విద్యనందించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

సోలార్ పవర్ బాక్స్ చోరీ

జే.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామంలోని కోటపాడు డొంక వద్ద మిరప పొలంలోని సోలార్ పవర్ బాక్స్ సోమవారం దొంగతనానికి గురైయింది. పంగులూరు గ్రామానికి చెందిన రైతు రావూరి ఆంజనేయులు ఉదయం మిరప మొక్కలకు నీరు పెట్టడం కోసం వెళ్లాడు. సోలార్ పవర్ ఆన్ చేయడానికి వెళ్తే పవర్ బాక్స్ దొంతనానికి గురైనట్లు గమనించాడు. బాధిత రైతు ఆంజనేయులు గత 3 రోజులు క్రితం పవర్ బాక్స్ రిపేర్ అయింది. దీంతో మెకానిక్‌ను పిలిచి కొత్త బాక్స్ బిగించాడు. దీని విలువ రూ. 9 వేలు వరకు ఉంటుందని రైతు తెలిపాడు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మధ్య కాలంలో మండలంలో పలుచోట్ల సోలార్ పంప్ సెట్లు దొంగతనానికి గురయ్యాయి. కాని ఒక్కటి దొరికిన దాఖలాలు లేవని రైతులు వాపోతున్నారు.



చోరీకి గురైయిన సోలార్ బాక్స్‌లు

ఉద్యమ నేత గద్దర్ మృతి బాధాకరం

చీరాల రూరల్: దళిత ఉద్యమాలు ఎక్కడ జరిగినా తన పాట, ఆటల ద్వారా మద్దతు తెలుపుతూ తన గళాన్ని వినిపిస్తూ అణగారిన వర్గాల ప్రజల లక్ష్యంగా తన గొంతుకను వినిపించిన ప్రజా వాగ్గేయకారుడు గద్దర్ మృతి ఎంతో బాధాకరమని, ఉద్యమాలకు తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. విజయనగర్ కాలనీలోని కారంచేడు మృత వీరుల రుధిర క్షేత్రం వద్ద కారంచేడు బాధితుల సంఘం ఆధ్వర్యంలో గద్దర్ చిత్రపటానికి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. గద్దర్ తన జీవిత కాలమంతా పీడిత, తాడిత అణగారిన వర్గాల ప్రజలకు అండగా ఉంటూ తన పాటల ద్వారా చైతన్య పరుస్తూ ఉద్యమాలు నడిపారని వారు కొనియాడారు. అలానే కారంచేడు ఉద్యమంలో గద్దర్ బాధితుల పక్షాన ముందుండి ఉద్యమాన్ని నడిపారని గుర్తు చేశారు. కార్యక్రమంలో భాస్కరరావు, తేళ్ల సుబ్బారావు, లక్ష్మీ నరసయ్య, రవికుమార్, తేళ్ల వందనం, దుడ్డు ఏసుపాదం తదితరులు పాల్గొన్నారు.



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కారంచేడు బాధిత కుటుంబ సభ్యులు

డిజిటల్ లైబ్రరీతో మెరుగైన విజ్ఞానం

మేదరమెట్ల: డిజిటల్ లైబ్రరీతో విద్యార్థులకు, ప్రజలకు చాలా ఉపయోగాలు ఉంటాయని సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న లైబ్రరీలో మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామస్తులతో సోమవారం సమావేశం నిర్వహించారు. లైబ్రరీకి ఎలాంటి పుస్తకాలు కావాలి, డిజిటల్ లైబ్రరీకి కావాల్సిన సదుపాయాల గురించి పలువురు తమ అమూల్యమైన సూచనలు ఇచ్చారని, డిజిటల్ లైబ్రరీని మాజీ ఏఎంసీ చైర్మన్ వైవీ భద్రారెడ్డి సహాయ సహకారాలు అందించారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు అవసరం

సంతమాగులూరు (అద్దంకి రూరల్): ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని సంతమాగులూరు ఎస్సై శివకుమార్ అన్నారు. సోమవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌లకు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాత్రివేళల్లో ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలని, ట్రాక్టర్‌పై సౌండ్ సిస్టమ్ ఎక్కువగా పెట్టుకుని డ్రైవింగ్ చేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ట్రాక్టర్ డ్రైవర్లు పాల్గొన్నారు.



ట్రాక్టర్ డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై

ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు పెంపు

బల్లికురవ: గ్రామాల్లోని ప్రతి ఒక్కరూ ఇంటి ముందు వృథానీరు, వర్షపునీరు తిరిగి భూమిలోకి వెళ్లే ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ కోరారు. సోమవారం వైదన గ్రామంలో ఇంకుడు గుంత ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం జగనన్న కాలనీ లేఅవుట్‌లోని లబ్ధిదారులకు ఇంకుడు గుంత నిర్మాణానికి రూ. 6 వేలు అందజేస్తుందని, అవకాశానికి సద్వియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడా జయలక్ష్మీ, వీవోఏ రేఖ, వైఎస్సార్ సీపీ నాయకులు మేడా శివదుర్గా పాల్గొన్నారు.



ఇంకుడు గుంతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

గడప గడపకు మన ప్రభుత్వం నేడు

మేదరమెట్ల: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయతీలో మంగళవారం సాయంత్రం ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రక్త పరీక్ష పరికరం వితరణ



రక్త పరీక్ష పరికరం అందజేస్తున్న దాత సతీష్

చినగంజాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాత బయ్యా సతీష్ రక్తపరీక్ష పరికరం (సెంట్రీ ఫ్యూజ్)ను సోమవారం అందజేశారు. వైద్యాధికారి ఎస్ విజయ భాస్కర్‌కు దాత స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి శ్రీ చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు కార్డు ఇవ్వాలి



కౌలు రైతు సభలో మాట్లాడుతున్న హరిబాబు

జే.పంగులూరు: భూ యజమానితో సంబంధం లేకుండా, కౌలు వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డు ఇవ్వాలని మండల కౌలు రైతు సంఘం మహాసభ తీర్మానించింది. సోమవారం పంగులూరులో జరిగిన కౌలు రైతు సంఘం మహాసభలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎం హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం పెంచి, ఆ మొత్తాన్ని కౌలు రైతులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి, సంఘం నాయకులు మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో హుండీ చోరీ

బల్లికురవ: పథకం ప్రకారం దొంగలు ఆలయం తలుపులు తెరచి హుండీలోని నగదు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలోని అంబడిపూడి గ్రామంలోని అంకమ్మతల్లి ఆలయంలో జరిగింది. పూజాది కార్యక్రమాలు ముగించి ఆలయం తలుపులు మూశారు. సోమవారం ఆలయానికి వెళ్లిన భక్తులకు హుండీ పగులగొట్టి ఉండటంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సుమారు రూ.10 వేల పైచిలుకు నగదు చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై వీ. వేమన తెలిపారు.

అక్కమాంబకు ప్రత్యేక పూజలు

పోతినవారిపాలెం (కారంచేడు): గ్రామ దేవత, పోతినవారి ఆరాధ్యదైవం అక్కమాంబకు మొదటి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి మండలంలోని పోతినవారిపాలెం గ్రామంలో సర్పంచ్ పోతిన శ్రీనివాసరావు, పోతిన వెంకట్రావు, పోతిన నాగేశ్వరరావు, పోతిన మస్తాన్‌రావు, పోతిన లక్ష్మీనారాయణల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారిని గ్రామంలోని అన్ని ప్రధాన వీధుల్లో ఊరేగించి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో గుంటూరు జిల్లా కాకుమాను, కొండపాటూరు, కారంచేడు, పోతినవారిపాలెం గ్రామాల్లోని పోతిన వారి వంశీకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం సుమారు 2 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు, వంశీకులు

ఆరోగ్యమే మహాభాగ్యం



ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో, వైద్యురాలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్, వైద్యాధికారులు

అద్దంకి: ఆరోగ్యమే మహాభాగ్యమని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. ఆయన అధ్యక్షతన సమావేశం యూపీహెచ్‌లో సోమవారం డీ వార్మింగ్ డేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాకానిపాలెం, గాజులపాలెం యూపీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ నాగసాయికుమార్, గొట్టిపాటి జయసింహ డీవార్మింగ్ డే గురించి, నులిపురుగుల నివారణ ఎలా చేయాలో తెలియజేశారు. నులిపురుగు సంక్రమణ, దాని వివిధ దశల గురించి, హాని చేసే విధానాన్ని తెలిపే వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ లక్కెనబోయిన ఎస్తేరమ్మ, వైస్ చైర్మన్లు దేశు పద్మేశ్, కే అనంతలక్ష్మి, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంఈవో, హెచ్ఎంలు, ఏఎన్ఎంలు, హెడ్ నర్సులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్‌బెండజోల్ తప్పనిసరి

బల్లికురవ: ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఆల్‌బెండజోల్ మాత్రలు అందజేసిందని ప్రతి విద్యార్థిచేత మింగిచాలని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యధికారి భారతి అన్నారు. ఈ నెల 10వ తేదీ జరగే నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులకు 5500 మందికి అంగన్‌వాడీ చిన్నారులు 2500 మందికి మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణ, ఎంఈవో కె. రమేష్‌బాబు, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముర్రుపాలల్లో పోషక విలువలు



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



వైదనలో పోషణ కిట్ పంపిణీ చేస్తున్న సర్పంచ్



వేటపాలెంలో గర్భిణులకు సీమంతాలు చేస్తున్న క్లబ్ సభ్యులు

వేటపాలెం: బిడ్డ పుట్టగానే తల్లి అందించే ముర్రుపాలల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని సీడీపీవో సుచిత్ర పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోగల రోటరీ కమ్యూనిటీ హాల్లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. 32 మంది గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు బట్టా మోహన్‌రావు, కార్యదర్శి ఏవీ సురేష్, రోటరీ చార్టర్ ప్రెసిడెంట్ జీ సీతారాం, సుబ్బారావు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చీరాల టౌన్: రెండేళ్ల వరకు తల్లిపాలు ఇవ్వడం వలన బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యంతో పాటుగా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.విజయలక్ష్మీ సూచించారు. మండలంలోని గవినివారిపాలెం గ్రామ పంచాయతీలోని పుల్లాయిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం గర్భిణులకు ప్రభుత్వం అందించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులు, గర్భిణులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా పర్చూరు ప్రాజెక్ట్ స్థాయిలోని మూడు మండలాల కార్యకర్తలతో సీడీపీవో ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సుభద్ర మాట్లాడుతూ ఆగస్టు 1 నంచి 6వ తేదీ వరకు గ్రామ స్థాయిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పర్చూరు ఐసీడీఎస్ పరిధిలోని పర్చూరు, మార్టూరు, యద్దనపూడి మండలాల కార్యకర్తలు, సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

పోషణ కిట్లతో మరింత పౌష్టికాహారం

బల్లికురవ: ప్రభుత్వం బాలింతలకు, గర్భిణులకు రక్తహీనత నుంచి విముక్తి కల్పించేందుకు అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను సద్వియోగ పరచుకోవాలని వైదన గ్రామ పంచాయతీ సర్పంచ్ మేడా జయలక్ష్మీ అన్నారు. సోమవారం గ్రామంలో బాలింతలు గర్భిణులకు పోషణ కిట్లు అందజేశారు. పోషణ కిట్లతో పోషకాహార లోపాన్ని నివారించుకోవచ్చని ఒక్కో కిట్‌కు ప్రభుత్వం రూ. 1612 ఖర్చుచేస్తుందని సర్పంచ్ వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య శాఖ పాల్గొన్నారు.